

లుంగపర్తి రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి -అనంతగిరి:లుంగపర్తి రోడ్డు గోతులమయం కావడంతో గ్రామ యూత్ ముందుకు వచ్చి మరమ్మతు పనులు చేపట్టారు. లుంగపర్తి పంచాయతీ పులుసుమామిడి మెయిన్ రోడ్డు నుండి లుంగపర్తి గ్రామం వరకు సుమారు కిలోమీటర్ ఉంటుంది. లుంగపర్తి నుండి దిగువపటే, దిగువపటే, చీడివలస వరకు గత ఏడాది తారు రోడ్డు నిర్మించారు. భారీ లోడులతో వాహనాలు రాకపోకలు సాగించడంతో సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరింది. స్పందించిన గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు మరమ్మతు పనులు చేపట్టారు.


పనులు చేపడుతున్న గ్రామస్తులు

ఆసక్తి ఉన్న రంగాల్లో.. విద్యార్థులను పోత్సహించండి

-ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్ -ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి ఏకలవ్య కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి-అరకులోయ:విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సహించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి .అభిషేక్ సూచించారు. ఎండపల్లి వలస ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో రాష్ట్రంలోని 28 ఈఎంఆర్ఎస్ పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన ఐదవ రాష్ట్రస్థాయి సాంస్కృతిక సాహిత్య ఉత్సవం ముగింపు వేడుకలకు శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో సాంస్కృతిక సాహిత్య ఉత్సవాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన విద్యార్థులకు కళలు, సాహిత్య రంగంలో ఎంతో ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి కలిగి ఉందో గుర్తించి ఆ దిశ గా ప్రోత్సహించాలని సూచించారు. గిరిజన విద్యార్థులు తెలుగు చిత్ర పరిశ్రమంలో స్థానం సంపాదించే అంత ప్రతిభ ఉందని చెప్పారు. మన మీద మనకి విశ్వాసం పెరగాలంటే సరైనవేదిక ఉండాలని చెప్పారు. ప్రయత్నిస్తే విజయం ఆలస్యం కావచ్చు కానీ తప్పకుండా వస్తుందని చెప్పారు. విద్యార్థులకు రివార్డులు కన్నా గుర్తింపు ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతోపాటు, క్రీడలు, సాహిత్య రంగాలపై ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. విద్యార్థులను ప్రోత్సహించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. రానున్న రెండేళ్లలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తాయన్నారు. చింతపల్లి, పెదబయలు, అరకు వ్యాలీ ఈఎంఆర్ఎస్ పాఠశాలను ప్రధానమంత్రి వర్చువల్ గా ప్రారంభించారని చెప్పారు. హుకుంపేట, అనంతగిరి ఈ ఆర్ ఎస్ పాఠశాలల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఐటిడిఎ పీఓ కు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకులం జాయింట్ సెక్రటరీ ఎం.రమణమూర్తి, గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జ్ ఉప సంచాలకులు ఎల్.రజని గురుకులం ప్రిన్సిపాల్ పిఎస్ఎన్ మూర్తి, ఈ ఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ భాస్కరరావు, ఏపీ ఆర్జెసి ప్రిన్సిపల్ వెంకట నాయుడు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు జ్ఞాపికలు ఇస్తున్న పిఒ అభిషేక్


నృత్యం చేస్తున్న కళాకారిణి

భూసేకరణ వేగవంతం చేయాలి

-కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి 516-ఇ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో భూసేకరణ అధీకృత అధికారులు, జాతీయ రహదారుల, అటవీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రంపచోడవరం నుండి కొయ్యూరు- పాడేరు- అరకు సెక్షన్ల మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారుల ప్రగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా సెక్షన్లలో ఎనిమిది ప్రాంతాలలో సుమారు 6.30 కిలోమీటర్ల మేర రహదారి అటవీ ప్రాంతం గుండా వెల్తున్నందున 18.22 హెక్టార్ల భూమి అవసరమన్నారు. అందుకు అనుగుణంగా సమర్పించిన ప్రతిపాదనలకు వెంటనే ఆమోదం జరిగిలే తగు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం, చింతూరు, చింతపల్లి డిఎఫ్.ఓ లను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన భూ సేకరణ వేగవంతం చేయాలని, సర్వే త్వరితగతిన పూర్తి చేసి నష్ట పరిహారం అందజేయానికి చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. రహదారి నిర్మాణానికి అభ్యంతరం లేని ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా ప్రాంతాలలో నిర్మాణాలను వేగవంతం చేయాలని జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్లు సౌర్యమాన్ పటేల్. కల్పశ్రీ, అపూర్వ భరత్, డిఆర్ఓ బి.పద్మావతి, జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్లు గుల్షన్, రవిషేక్, ఇ.ఇ శ్రీనివాస్, చింతపల్లి, చింతూరు, రంపచోడవరం డిఎఫ్ఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఒ

గ్రామసభలతో పనుల గుర్తింపు

- ఎపిఒ సన్యాసినాయుడు

ప్రజాశక్తి -అనంతగిరి:ఉపాధి హామీ పనులను గ్రామ సభల ద్వారా గుర్తింపుకు సాధ్యపడుతుందని మండలం ఉపాధి హామీ ఎపిఓ సన్యాసినాయుడు అన్నారు, నాన్ షెడ్యూల్ గుమ్మకోట పంచాయతీలో శనివారం సర్పంచ్ పాగి అప్పారావు అధ్యక్షతన సచివాలయం వద్ద గ్రామ సభ ఏర్పాటు చేశారు, ఈ సభను ఉద్దేశించి ఏపీవో మాట్లాడుతూ, 2024- 25 సంవత్సరానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు పనులు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు.సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంతోనే భూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. జీడి మామిడి, ఇతర మొక్కలను రైతులకు పంపిణీ చేయాలని తీర్మానం చేశారు. ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ గంజాయి, సారా రవాణా నేరమన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి తట్టినాయుడు, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, సచివాలయం సిబ్బంది, టిఏలు కొండలరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

30 కేజీల గంజాయి పట్టివేత

- ఐదుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం మోతుగూడెం పోలీసు స్టేషన్ పరిధి గొడ్లగూడం జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో మోతుగూడెం పోలీసులు 30 కేజీల గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మోతుగూడెం పోలీసు స్టేషన్‌కు వచ్చిన మేరకు పోలీసులు గొడ్లగూడం జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ మార్గంలో వస్తున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్ద ఉన్న 30 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రూ.1,50,000 విలువైన ఈ గంజాయిని మహబూబాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. అల్లూరి జిల్లా డొంకరాయి రాజుక్యాంప్‌కు చెందిన పాంగి చింటూ, మండి ఈశ్వరరావు, తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక గ్రామానికి చెందిన నల్ల శ్రీకాంత్, మహబూబాబాద్ జిల్లా, కందికొండ గ్రామానికి చెందిన బానోతు దిలీప్, ఇస్లావత్ ఆనంద్ తదితర ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఎస్సై కె.శివనారాయణ, ఎఎస్ఐ రాజేశ్వరరావు, హెచ్‌సి రవిచంద్ర, పిసిలు ఎస్.నిబంధనరావు, సన్యాసిరావు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్సై శివ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఈ-శ్రమ కార్డుల కోసం నమోదు చేస్తున్న దృశ్యం

ఈ-శ్రమ కార్డులకు వివరాలు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-దేవీపట్నం

ఈ-శ్రమ బీమా కార్డుల కోసం ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని ఇందుకూరు గ్రామంలో ఈ-శ్రమ ఇన్సూరెన్స్ కార్డులు నమోదు కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ 21 మందికి ఈ-శ్రమ ఇన్సూరెన్స్ నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ శ్రమ ఇన్సూరెన్స్ నమోదు చేయించుకోవడం వలన భవిష్యత్తులో అనుకోకుండా ప్రమాదాలు జరిగి శాశ్వతంగా కాళ్లు, చేతులు కోల్పోయినా, లేదా మరణించినా కుటుంబ సభ్యుల్లో నామినికి ఇన్సూరెన్స్ అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ-శ్రమ ఇన్సూరెన్స్‌కు అభ్యర్థి రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, నామిని ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంటు జిరాక్స్‌తో పాటుగా ఆధార్ కార్డుకు లింక్ అయినా ఫోన్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు రంపచోడవరం పిఎంఆర్‌సిలో ఉన్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.రామకృష్ణ ఫోన్ నెంబర్ 9866131462కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండదొరల సంఘం జిల్లా నాయకులు యలగాడ నాగేశ్వరరావు, ఆదివాసి జేఏసీ నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్న దొర, పచ్చుకూరి గౌరీ శంకర్, కానూరి రామకృష్ణ, వీరబాబు, సింబోతుల దుర్గాప్రసాద్, పరదా వీరమణి, పరదా వెంకట రమణ, ఈరేటి ఉమామహేశ్వరి, అనసూయ పాల్గొన్నారు.

వారపు సంతలో నాటు కోళ్లు, మేకలకు గిరాకీ


సంతలో మేకల విక్రయాలు చేపడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-హుకుంపేట:దసరా పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని శనివారం వారపు సంతలో నాటు కోళ్లు, మేకలకు మంచి గిరాకి పలికింది. అధికంగా నాటు కోళ్లు, మేకల క్రయవిక్రయాలు జరిగాయి. సంతలో నాటు కోళ్లకు 3000 వరకు, మేకలకు రూ.10,000 నుంచి జత 30000 వరకు ధర పలకడంతో రైతులు కొంత సంతోషాన్ని వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాల నుంచి అమ్మకాలకు చార్జీలు పెట్టుకొని తీసుకొచ్చిన నాటు కోళ్లు, మేకలకు కొన్నిసార్లు ధర లేక పోవడంతో నష్టానికి గురవుతున్నారు. దసరా నెల కావడంతో అధిక రేట్లకు అమ్మకాలు జరగడంతో కష్టాన్ని ఫలితం దక్కిందని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


సంతలో కోళ్ల విక్రయాలు చేపడుతున్న గిరిజనులు


అధికారులతో సమీక్ష చేస్తున్న జాయింట్ కలెక్టర్


ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-పాడేరు:ఓటరు జాబితా సిద్ధం చేయడానికి రాజకీయ పార్టీల సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ స్పష్టం చేసారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాలో మార్పులు చేర్పులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరకు వ్యాలీ నియోజక వర్గంలో 97.68 శాతం, పాడేరు నియోజక వర్గంలో 96.63, రంపచోడవరం లో 98.21 శాతం ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు నివేదికల మేరకు డూప్లికేట్ ఓటర్లు, మృతి చెందిన ఓటర్లను ఓటరు జాబితా నుండి తొలగిస్తామన్నారు. ఓటరు రేషనలైజేషన్ ప్రక్రియ పక్కాగా జరుగుతోందన్నారు. స్వీప్ కార్యక్రమాల నిర్వహణకు నోడల్ అధికారిని నియమిస్తామని తెలిపారు. . 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫారం 6- 861, ఫారం 7-853, ఫారం 8 - 786 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్.డిఓ. బి.పద్మావతి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి సానాయి గంగరాజు, వైసిపి నుంచి వి.రాంబాబు, సిపిఐ (ఎం) వి.హెచ్ దాస్, కాంగ్రెస్ వి. కృష్ణారావు, టిడిపి ప్రతినిధి వి.జ్యోతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో వర్షం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఐదు గంటల నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో వివిధ మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తిరుగు ప్రయాణానికి పలు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలోని వీధి కాలువలన్ని వరద నీటితో నిండి ప్రవహించాయి. పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం తిలకించడానికి వచ్చిన పర్యాటకులు కూడా వర్షంతో నిరాశతో వెనుదిరి గారు.


నివాళి అర్పిస్తున్న సిపిఎం నేతలు

ఏచూరి ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: తూటంగి పంచాయతీలో సిపిఎం పంచాయతీ కార్యదర్శి సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన మహాసభలో కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులు అర్పించారు. మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ, సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి సూర్యనారాయణ, వి అచ్యుత్ పాల్గొన్నారు.


జి మాడుగుల :మండలం భీరం పంచాయతీ వి.కొడపల్లి గ్రామంలో సిపిఎం శాఖ మహాసభలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి సాగిన ధర్మన్నపడాల్, జగ్గందొర దీన బంధు, రామన్న పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అప్రమత్తం

ప్రజాశక్తి -సీలేరు


చతీష్‌ఘడ్ రాష్ట్రం దంతేవాడ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 36 మంది మావోయిస్టులు మృత్యువాతకు గురైన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఏఓబి సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో మావోయిస్టుల నుంచి ముప్పు వాటిల్లకుండా సిఆర్‌పిఎఫ్ బలగాలతో కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సీలేరు ప్రధాన కుడళ్ళలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సరిహద్దు నుంచి వచ్చే పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, వారి వివరాలు సేకరించి విడిచిపెట్టారు. ఏఓబి సరిహద్దు ప్రాంతంలో పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహించారు. మావోయిస్టుల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా సీలేరు జల విద్యుత్ కేంద్రం మెయిన్ డ్యామ్‌పై పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీస్ స్టేషన్ సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రామకృష్ణ కోరారు.


ఎఒబి సరిహద్దు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

స్వర్ణాంధ్ర విజన్-2047పై సదస్సు

ప్రజాశక్తి - చింతూరు

స్వర్ణాంధ్ర విజన్-2047లో "ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, పునరుత్పాదక ఇంధన వనరుల కేంద్రం", "నగరాల అభివృద్ధి - వృద్ధి కేంద్రాలుగా ఎలా అవతరించాలి?" అనే అంశాలపై స్థానిక ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం మాట్లాడుతూ రాష్ట్రానికి సరైన నగర కేంద్రం ఉంటే అది నగరాభివృద్ధికి, తద్వారా దేశాభివృద్ధికి కారణమవుతుందని చెప్పారు. నగరాల అభివృద్ధి దిశలో పయనించడం వల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, విద్య, ఆరోగ్యం మెరుగుపడతాయని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ పరిశ్రమలలో ఎక్కువగా బొగ్గు ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ శక్తిని ఉపయోగించడం జరుగుతుందని, పురత్పాదాక శక్తి వనరులైన సూర్య శక్తి, పవన విద్యుత్ శక్తి, సముద్ర తరంగ శక్తులను వినియోగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అర్ధశాస్త్ర విభాగాధిపతి జి.వెంకట్రావు మాట్లాడుతూ పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందడానికి రోడ్డు, రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. గణిత శాస్త్ర విభాగాధిపతి కె.శ్రీలక్ష్మి మాట్లాడుతూ పట్టణాలకు వివిధ ప్రాంతాల నుండి విభిన్న నైపుణ్యాలు, సంస్కృతులు, ఆలోచనలు కలిగిన వారు రావడం వల్ల వాళ్ళ ఆలోచనలలో సృజనాత్మకత పెరుగుతుందని చెప్పారు. తద్వారా ఆర్థిక, సామాజికాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిహెచ్ నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రత్నమాణిక్యం

వసతి గృహాల నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా రామన్న దొర

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలల వసతి గహాల నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు శనివారం రంపచోడవరంలో జరిగాయి. రంపచోడవరం డివిజన్ అధ్యక్షులుగా సుండం రామన్న దొర, ప్రధాన కార్యదర్శిగా పాములేటి చిన్నారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా రెడ్డి శివ కుమార్ ఎన్నియ్యారు. దేవరపల్లి తాతాజీ, కె.రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జి.నారాయణ, సిహెచ్.చిన వెంకటరెడ్డి, సిహెచ్.రోశారెడ్డి, ఎస్.రంగయ్య, ఎం.శ్రీనివాస్, మోహన్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

సత్యసాయి కార్మికుల సమ్మె విరమణ

ప్రజాశక్తి- దేవీపట్నం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మూడు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు శనివారం సమ్మె విరమించారు. మూడవరోజు సమ్మె సందర్భంగా రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ దీక్షా శిబిరాన్ని సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సమస్యలపై సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి విషయం తెలుసుకుని, అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడారు. ఈ సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో సత్యసాయి కార్మికులు సమ్మెను విరమింపజేశారు. విధులకు హాజరై ప్రజలకు తాగునీటిని అందిస్తామని సత్యసాయి కార్మికులు చెప్పారు.

లోకేష్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి రంపచోడవరం నియోజకవర్గం సమస్యలను తీసుకెళ్లినట్లు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లాల రాజ్ కుమార్ రెడ్డి తెలిపారు. డీఎస్సీ, పోలీస్ నోటిఫికేషన్ విడుదలవుతున్న నేపథ్యంలో ఐటిడిఎ పరిధిలోని అర్హులైన డీఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ అర్హులైన గిరిజన అభ్యర్థుల కోసం ప్రభుత్వం స్టడీ సెంటర్ ద్వారా శిక్షణ కల్పించాలని కోరారు. డీఎస్సీకి 524 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారికి అనుభవజ్ఞులచే ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ ఇవ్వాలన్నారు. మోటివేషన్ క్లాస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఐటిడిఎ అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. స్కూళ్లు, వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మారు మూల గిరిజన ప్రాంతాల్లో సిసి రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించాలని, పంచాయితీలకు నిధులు కేటాయించాలని కోరారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలవాలని లోకేష్‌ను కోరారు.


మంత్రి లోకేష్‌కు సమస్యలు తెలియజేస్తున్న రాజ్‌కుమార్ రెడ్డి

పలు రంగాల్లో అభివృద్ధికి ప్రణాళికలు

కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు, : వికసిత్ భారత్ 2047 ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోందని, ఈ ప్రణాళికకు అనుగుణంగా, రాష్ట్ర విజన్ 2047 ప్రణాళికలు తయారు చెయ్యడానికి జిల్లా స్థాయిలో సిద్ధం చేయడానికి సూచనలు, సలహాలు అందించి జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా నైపుణ్యం, సాంఘిక సంక్షేమం సురక్షిత జీవనం, సుస్థిరత-వాతావరణ సమతుల్యత, తయారీ రంగం-పారిశ్రామికాభివద్ధి, వ్యవసాయం-ప్రకతివ్యవసాయం మొదలగు రంగాలలో ఏటా 15శాతం అభివృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు తయారు చేయుటకు తగు సూచనలు, సలహాలు, అభిప్రాయాలు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. వికసిత్ భారత్ -2047 గూర్చి దాని అమలు, ప్రణాళికలు, లాభాలు గూర్చి జిల్లా ప్రణాళిక అధికారి ఎస్ఎస్ఆర్కే పట్నాయక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా ఎంపి .తనూజా రాణి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ జిల్లాలో సికిల్సెల్ అనీమియా కేసులు ఎక్కువగా ఉన్నాయని, అందుకు తగ్గ రక్త నిల్వలు లేవని తెలియజేస్తూ రక్త సేకరణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అరకు శాశన సభ్యులు మాట్లాడుతూ, కొన్ని గిరిజన తెగలలో అధిక సంతానానికి ప్రాధాన్యత ఇస్తున్నందున ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుందని కుటుంభ నియంత్రణపై అవగాహన కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంత పిల్లలకు నూతన విద్యావిధానం కన్నా పాత విధానమే మేలని అభిప్రాయపడ్డారు.

గిరిజన యువ ప్రగతి సంస్థ ప్రతినిధి డా. సింహాచలం మాట్లాడుతూ, ఉపాధి కల్పన, నైపున్యాభివృద్ధి, చిన్న పరిశ్రమల ఏర్పాటు, బ్యాంకు రుణాల ఇబ్బందులను వివరిస్తూ వాటిని ఎదుర్కొనేందుకు కొన్ని సూచనలు అందజేశారు. విసిఎఫ్ టాటా ట్రస్ట్ ప్రతినిధి కె.అప్పలరాజు మాట్లాడుతూ, రైతులకు అనుగుణంగా వ్యవసాయ నిపుణులు లేరని, రైతులకు తగు సాంకేతికత, ప్రకృతి వ్యవసాయంపై సలహాలు సూచనలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో రంపచోడవరం నుండి శాసనసభ్యురాలు శిరీషా దేవి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సంయుక్త కలెక్టర్ .ఎంజే అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, పలువురు జిల్లా అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల, రైతు సంఘాల, వర్తక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మల్టీ మెంబర్ సముచిత అథారిటీ సమావేశం

పాడేరు:కలెక్టరేట్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధ్యక్షతన శనివారం జిల్లా స్థాయి మల్టీ మెంబర్ సముచిత అథారిటీ సమావేశం నిర్వహించారు. కాన్సెప్షన్, ప్రీ నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ చట్టం-1994 ప్రకారం ఆడ భ్రూణహత్యలను నియంత్రించేందుకు, లింగ నిష్పత్తిని నివారించేందుకు లింగ ఎంపిక నిషేదంపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా మాట్లాడుతూ, జిల్లాలో ఈ చట్టం అమలుపై వివరించారు. జిల్లాలో 30 అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్లు ఉన్నాయని వీటిలో 26 ప్రభుత్వ ఆస్పత్రులలోను 4 ప్రైవేటు ఆసుపత్రులలో ఉన్నాయన్నారు. ఈ చట్టం పటిష్టంగా అమలులో ఉందని, జిల్లా లింగ నిష్పత్తి 970గా ఉందన్నారు. ఆసుపత్రుల యాజమాన్యం ప్రతి రోజు వెబ్ సైట్ పోర్టల్ లో పొందుపరిచిన ఎఫ్ - ఫారం రిపోర్టు ఖచ్చితంగా పంపించవలసి ఉన్నప్పటికి కొన్ని ఆసుపత్రులు పంపించకపోవడంపై వెబ్ సైట్‌లో తనిఖీ చేసి అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి రోజు విధిగా ఎఫ్ - ఫారం పూరించి పంపాలని హార్డ్ కాపీలను ఆసుపత్రులలో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అమెరికన్ ఇండియన్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీ కృష్ణ పాల్గొన్నారు..

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లు తగిలి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని పి.భీమవరం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... పి.భీమవరం గ్రామానికి చెందిన వేపాడ అప్పారావు కుమారుడు భువన్ శంకర్ (15) శనివారం బంజర్ పొలంలోకి వెళ్ళాడు. అక్కడ గెడ్డ దాటుతుండగా, అప్పటికే నేలపై తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ షాక్ గురై భువన్ శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించిన కుటుంబీకులు హుటాహుటిన చోడవరం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భువన్ శంకర్ వడ్డాది కెపిడి జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుచున్నాడు. భువన్ శంకర్ మృతితో తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ- బాకురుపాలెం రహదారిలో శనివారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. తర్లువాడకు చెందిన మాజీ వార్డు మెంబర్ మజ్జి అప్పలరాజు (50) శనివారం దేవాలయానికి బైక్‌పై వెళుతున్నాడు. లారీని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. అప్పలరాజును చికిత్స నిమిత్తం అపోలోకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.



సన్మానిస్తున్న వైస్ ఎంపిపి

విఆర్ఒ, సెక్రటరీలకు సన్మానం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీ వీఆర్ఓ చంద్రకళ, చీకుమద్దుల సెక్రటరీ ప్రశాంత్ బాబూలకు ఘనంగా వీడ్కోలు పలికారు. వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ అభివృద్ధికి తోడ్పడుతూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టిన వీఆర్వో, సెక్రెటరీ సేవలను మరువలేనివని కొనియాడారు. ఉద్యోగులకు వృత్తిలో భాగంగా బదిలీ సర్వసాధారణమని, వృత్తి ధర్మాన్ని పాటించి ఎన్నో సేవలు చేసారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నేరుపుట్టు సర్పంచ్ సోకేలి కృష్ణా రావు, చీకుమద్దుల సర్పంచ్ సూకూరు బొంజన్న దొర, గన్నేరుపుట్టు మాజీ సర్పంచ్ సూడిపల్లి లక్ష్మీ ప్రమీల, వైస్ సర్పంచ్‌లు మజ్జి మత్స్యరాజు పాల్గొన్నారు.

మనం సేవా సొసైటీ వార్షికోత్సవం

ప్రజాశక్తి - చింతపల్లి : గౌతమ్ నరేంద్ర మహర్షి మిత్ర బృందం చిన్న వయసులోనే సేవా గుణం కలిగి ఉండడం మంచి పరిణామమని స్థానిక సర్పంచ్ దురియా పప్పలత, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎస్సై అరుణ్ కిరణ్ లు అన్నారు. మనం సేవా సొసైటీ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ, గౌతమ్ నరేంద్ర మహర్షి తన మిత్ర బృందంతో ఆలోచన చేసి మనం సేవా సొసైటీ ని ఏర్పాటుచేసి నిరుపేదలు, నిర్భాగ్యులకు తనకు తోచిన సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. వీరు తోటి యువతరానికి మార్గదర్శకం కావాలన్నారు. మనం సేవా సొసైటీ చైర్మన్ గౌతమ్ నరేంద్ర మహర్షిని ప్రముఖులు దుస్సాలువాతో సత్కరించారు. స్థానిక ఆసుపత్రి వద్ద రోగులు కూర్చునేందుకు టేబుల్ బహుకరించారు. ఈ కార్యక్రమాలలో మాజీ సర్పంచ్ కంకిపాటి వీరన్న పడాల్ (బాబులు), వర్తక సంఘం కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, చేయూత వారియర్స్ ట్రస్ట్ చైర్మన్ దూనబోయిన రమణ, ఉపాధ్యాయుడు కే పీ రాజు, రుత్తల అర్జున్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

కాలువ నిర్మాణ పనులు

ప్రజాశక్తి - చింతపల్లి :మండలంలోని అన్నవరం పంచాయతీ సోమవరం గ్రామంలో మురుగు నీటి కాలువ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 95 గడపలు ఉన్న సోమవరం గ్రామంలో పంచాయతీ నిధులతో మురుగు నీటి కాలువ నిర్మాణ పనులను ఆ పంచాయతీ సర్పంచ్ పాంగి సన్యాసిరావు, ఎంపీటీసీ సభ్యుడు సూరిబాబులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సన్యాసిరావు మాట్లాడుతూ, గ్రామంలో రెండు వీధులకు కాలువలు లేకపోవడంతో వర్షాలు కురిసిన ప్రతిసారీ రహదారి కోతకు గురై సమస్య తలెత్తుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ నిధులతో నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.

మన్యంలో దట్టంగా పొగ మంచు

ప్రజాశక్తి-హుకుంపేట: ఏజెన్సీ ప్రాంతంలో చలి మొదలైంది. సాయం కాలం నుంచి ఉదయం ఆరు వరకు చలి తీవ్రత అధికంగా ఉంది. వాహనదారులు రాక పోకలకు హెడ్ లైట్ వేసుకొని ప్రయాణాలు సాగించారు. పలు గ్రామాల్లో గిరిజనుల మంటలు కాగారు.



దట్టంగా పొగ మంచు

హత్యకేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - చింతపల్లి : మద్యం సేవించడం చెడు సహవాసాలే రాజా అర్జున్ హత్యకు కారణాలని సీఐ రమేష్ అన్నారు. మండలంలోని పెదబరడ పంచాయతీ చింతలూరు గ్రామ సమీపంలోని టేకుతోటలో సెప్టెంబర్ 27న లభ్యమైన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కేసును చింతపల్లి ఎస్సై అరుణ్ కిరణ్ ఆధ్వర్యంలో కొన్ని గంటల వ్యవధిలోనే పోలీసులు చేదించారు. సీఐ రమేష్ శనివారం అందించిన వివరాల ప్రకారం రాజమండ్రికి చెందిన దొడ్డి రాజ అర్జున్ (50) వడ్రంగి పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఇతడు గత కొద్దికాలంగా మద్యానికి బానిస కావడంతో 20 ఏళ్ల క్రితం భార్యా పిల్లలు ఇతనిని విడిచి హైదరాబాద్ వెళ్లి జీవిస్తున్నారు. రాజా అర్జున్ రాజమండ్రిలో తన సోదరీ వద్ద ఉంటూ వడ్రంగి పని చేస్తు జీవిస్తూ, మద్యం అలవాటు ఉన్న మరో ఇద్దరు స్నేహితులతో మద్యం సేవించేవాడు. కార్పెంటర్ పని నిమిత్తం మన్య ప్రాంతానికి వెళ్లాలని నిర్ణయించుకున్న వీరు రాజమండ్రికి చెందిన ఇంటీరియర్ డెకరేషన్ దుకాణ యజమాని వద్ద ముగ్గురూ విజిటింగ్ కార్డులు తీసుకున్నారు. గత నెల 27న లోతుగెడ్డ కూడలికి ముగ్గురూ చెరుకున్నారు. మద్యం మత్తులో వీరి మధ్య తగాదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో రాజా అర్జున్‌ను హత మార్చాలని పుష్పరాజ్, వెంకటేష్‌లు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు లోతుగెడ్డ కూడలిలో నాటు సారా కొనుగోలు చేసి సమీపంలోని టేకు తోటల్లోకి ముగ్గురు చేరుకున్నారు. రాజా అర్జున్ చేత పూటుగా సారా తాగించారు. మద్యం మత్తులోనున్న రాజా అర్జున్‌పై రాయితో తలపై మోది హతమార్చారు.ఈ క్రమంలో డౌనూరు వద్ద మద్యం సేవిస్తున్న నిందితులు వెంకటేష్, పుష్పరాజ్ లను తమ సిబ్బంది చాకచాక్యంగా పట్టుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నామని సీఐ తెలిపారు. కేసును చేదించిన చింతపల్లి, అన్నవరం ఎస్సైలు అరుణ్ కిరణ్, వీరబాబును అభినందించారు.

అభ్యంతరాలను ఆధారాలతో తెలియజేయండి

ప్రజాశక్తి -పాడేరు : జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి కార్యాలయం పరిధిలో మిషన్ శక్తి పథకం, వన్ స్టాప్ కేంద్రం కింద మంజూరైన పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి సూర్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అందరి అభ్యర్థుల పూర్తి వివరముల (అర్హులు, అనర్హుల)తో జాబితాను రూపొందించి సమాచార నిమిత్తం జిల్లా వెబ్సైట్‌లో పొందుపరచడమైందన్నారు. ఈ జాబితాను జిల్లా కలెక్టర్, సబ్- కలెక్టర్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి కార్యాలయముల నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తామని తెలిపారు. అభ్యర్థుల విద్యార్హత, ఉత్తీర్ణతశ్రేణి, పనిచేసిన అనుభవంను పరిగణనలోకి తీసుకొని, మెరిట్ ఆధారంగా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తామన్నారు. అభ్యర్థులు జాబితాను పరిశీలించుకొని, అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆధారాలతో (ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో) ఈ నెల 9న సాయంత్రం 5 గంటల లోపు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి కార్యాలయం (తలారిసింగి, పాడేరు)లో సమర్పించి, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆమె స్పష్టం చేసారు.



గిరిజనులతో కలిసి నినదిస్తున్న లోకనాథం

'ఉరక గెడ్డ' కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి - మాడుగుల : ఉరక గెడ్డ రిజర్వాయర్ నిర్వాసితుల పరిహార కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని శంకరం పంచాయతీ ఉరకగెడ్డ రిజర్వాయర్ ప్రాంతాన్ని ఆయనతో పాటు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తిలతో కూడిన బృందం పరిశీలించింది. ప్రాజెక్టు పునరావాస బాధిత గ్రామాలైన బొడ్డ రేవు, చిన బొడ్డరేవు గిరిజనులుతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. అనంతరం లోకనాథం మాట్లాడుతూ బాధితులకు ఆర్ఆర్ ప్యాకేజీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నిర్మాణం జరిగినప్పుడు బొడ్డరేవు, చినబొడ్డరేవు గిరిజన గ్రామాలకు చెందిన 56 గిరిజన కుటుంబాల వారికి.. ప్రాజెక్టులో మునిగిపోయిన వారికి ఆర్ఆర్ ప్యాకేజీ అమలు కోసం ప్రభుత్వం 2005 ఏప్రిల్ 8న జిఒ నెంబరు 68ని విడుదల చేసిందన్నారు. ఆ ప్రకారం పునరావాస బాధిత కుటుంబాలకు సంబంధించి ఒక్కో ఇంటి స్థలం చొప్పున ఇవ్వడంతో పాటు 56 కుటుంబాలకూ అన్ని రాయితీలూ కలుపుకొని ఆర్ఆర్ ప్యాకేజీ ప్రకారం రూ.5 కోట్లు పైబడి ఇవ్వవలసి ఉందన్నారు. కానీ కేవలం ఇంటి స్థలం.. ఇందిరమ్మ స్కీమ్ ఇల్లు మంజూరు చేసి చేతులు దులుపుకొని గిరిజన పునరావాస బాధితులకు నష్టపరిహారం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. అధికారులు భారీ కుంభకోణానికి పాల్పడినట్టు అర్థమవుతోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి పునరావాస బాధితులకు వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. బాధితులకు న్యాయం కోసం దశలవారీగా ఆందోళనలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే గిరిజనుల తరుపున న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసుకుని ఎత్తిపోతల పథకం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీటిని ఉపయోగించుకుంటూ అమాయక గిరిజనులను మోసం చేయడం దారుణమన్నారు. సమస్యను పరిష్కరించకుంటే ప్రభుత్వం, అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కె.భవాని, దేవరాపల్లి మండల కార్యదర్శి బిటి.దొర, పునరావాస బాధితులు పాల్గొన్నారు.

కాలేశ్వరరావు ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి-సీలేరు : పిఆర్‌టియు అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులుగా డివి.కాలేశ్వరరావుని ఎంపిక చేయడం పట్ల ఆ సంఘం జీకే వీధి మండల నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న కాలేశ్వరరావు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చురుకైన పాత్ర పోషిస్తున్నారు. సంఘం విశాఖ, అనకాపల్లి, పాడేరు మూడు జిల్లాల కన్వీనర్ డి.గోపీనాథ్ తనను ఎంపిక చేసినందుకు కాలేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

నగర అభివృద్ధికి పాటుపడదాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అందరం కలిసి విశాఖ నగర అభివృద్ధికి పాటుపడదామని జివిఎంసి చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్ రాజు అన్నారు. శుక్రవారం జివిఎంసి చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన శివప్రసాదరాజును శనివారం ఉదయం జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొంప చంద్రమౌళి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసి అభివృద్ధిలో భాగస్వాములవుదామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ రాజాన వెంకటరావు, కార్యదర్శి రంది సాధురావు, ఉపాధ్యక్షులు పిఎస్.ప్రసాద్, పి.ఎ.రాజు, సలహాదారులు పైలా కృష్ణారావు, ప్రసాద్, ఆర్.ఎ.నాయుడు, అల్లు గోవిందరావు, సత్యనారాయణ, గణేష్, పెద్దఎత్తున కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

'ఉక్కు'పై కూటమి చొరవ చేసేనా..

స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరిచే కుట్రలను అడ్డుకునేనా.. - ఎంత కాలం బిక్కుబిక్కుమంటూ జీవనం

- సర్వత్రా కార్మికుల్లో చర్చ

- ఉధృతం దిశగా ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం - నేడు భారీ మానవహారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎలా వ్యవహరించనుందన్న చర్చ నేడు సర్వత్రా సాగుతోంది. కర్మాగారాన్ని బలహీన పరిచే మోడీ ప్రభుత్వ కుట్రలను అడ్డుకోవాలని కార్మికవర్గం కోరుతోంది. వాస్తవానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు 2021లో నిర్ణయం తీసుకున్న దగ్గర నుంచీ కార్మిక, ప్రజా పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణ బంతి వీరి కోర్టులోకి వచ్చి పడింది. అప్పటికే ప్రధాని నరేంద్ర మోడీ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడం లేదా ప్రైవేటీకరించడం మా విధానం అంటూ రాజకీయ నిర్ణయం చేసిన సంగతి తెలిసిందే. దీన్ని ఆపాలంటే కార్మికుల పోరాటానికి రాజకీయ పార్టీల అండా ఎంతో అవసరం. ఇప్పటికే ప్లాంట్ రక్షణకు సిపిఎం, వామపక్షాలు పోరాడుతున్నాయి. నేడు ఉక్కు పోరాటానికి ప్రధానంగా టిడిపి, జనసేన జోడు గుర్రాలుగా నిలవాల్సి ఉంది. అయితే ఈ పార్టీలు చొరవ చేసి కేంద్ర నిర్ణయాన్ని నిలువరిస్తాయా ? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల ముందు వరకూ ప్లాంట్‌ను కాపాడుతామన్న కూటమి నాయకులు ఎన్నికలయ్యాక మాటలతోనే సరిపెడుతున్నారు. మరోపక్క ఉక్కు కార్మికులు మాత్రం పట్టు విడవక 1331 రోజులుగా ఉద్యమిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే ఆదివారం 8 గంటల నుంచి 10 గంటల వరకూ భారీ మానవ హారానికి గాజువాక నియోజకవర్గంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కుటుంబాలతో సహా అందరూ హాజరయ్యే అవకాశముంది. ఇంకెంత కాలం తాము బిక్కుబిక్కుమంటూ జీవించాలంటూ ఇప్పటికే ఉక్కు కార్మికుల్లో ఆగ్రహ జ్వాలలు రగుల్కొంటున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు భూములిచ్చిన నిర్వాసితులు ప్రైవేటీకరణ పట్ల తీవ్ర కలత చెందుతున్నారు. ఇటీవల నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని స్టీల్ యాజమాన్యం చూసింది. దీంట్లో వీరే అత్యధికం. ఇదిలా ఉండగా మరో 2500 మంది పర్మినెంట్ ఉద్యోగులపై విఆర్ఎస్ అస్త్రం ప్రయోగించాలని ఉక్కు యాజమాన్యం చూస్తోంది. ప్రభుత్వ గనుల విధానం 2013 ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలకు గనులు కేటాయించాలన్న నిబంధన ఉన్నా కేంద్ర బిజెపి ఉల్లంఘిస్తూ వస్తోంది. ఆ పార్టీతో జత కట్టి రాష్ట్రంలో గెలిచిన టిడిపి, జనసేనలు చొరవ చేసి బిజెపిని ఆపకపోతే తీవ్రస్థాయిలో కార్మికాగ్రహాన్ని చవిచూడక తప్పదన్న వాతావరణం అంతటా నెలకొంది. కనీసం సెయిల్‌లో స్టీల్‌ను విలీనం చేసే ప్రక్రియను కూడా కేంద్రం చేపట్టడం లేదు. ఇంకోపక్క ఉక్కు ఉద్యోగులపై విపరీతమైన ఆర్థిక ఆంక్షలను యాజమాన్యం విధిస్తోంది.

గాజువాక అభివృద్ధిలో కీలక పాత్ర

గాజువాక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించడంలోనూ, తలసరి ఆదాయం అత్యధికంగా ఉన్న ప్రాంతంగా గాజువాకను నిలపడంలోనూ స్టీల్‌ప్లాంట్‌దే కీలకపాత్ర. ప్లాంట్‌ను కార్మికులు సుదీర్ఘకాలం ప్రగతిపథాన నడిపారు. మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ప్లాంట్‌కు గడ్డుకాలం మొదలైంది.

కేంద్రం ప్రైవేటీకరణ జరగదంటూనే ప్లాంట్‌లోని రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసెయ్యడం, కాంట్రాక్టు కార్మికులను తొలగించే ప్రక్రియకు పూనుకోవడం వంటి చర్యలతో బలహీనపరిచే కుట్రలను వేగవంతం చేస్తోంది. కూటమిలో ప్రధాన భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేనలు మేం మాట్లాడుతున్నాం.. ఆపుతున్నాం అంటూ చెప్పుకుంటూ వస్తున్నా కేంద్రం నుంచి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే ప్రకటన రావడం లేదు. ఇదే కొనసాగితే భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలు, కార్మికుల ఆగ్రహాన్ని కూటమి పార్టీలు చవిచూడక తప్పదని పలువురు హెచ్చరిస్తున్నారు.

హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ ట్రస్టుకు సోషల్ ఇంపాక్ట్ అవార్డు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతిష్టాత్మక బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా మొబిలిటీ సోషల్ ఇంపాక్ట్ అవార్డును విశాఖపట్నానికి చెందిన సెంటర్ ఫర్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ గెలుచుకుంది. ఇది ఒక సామాజిక సేవా సంస్థ. 2024 సంవత్సరానికి ఈ అవార్డు లభించినట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. మొబిలిటీ నైపుణ్యాల ద్వారా ఆదివాసీ మహిళలకు సాధికారిత కల్పించడం లక్ష్యంగా ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చినట్లు, ఈ ప్రాజెక్ట్ మహిళల ఆర్థిక స్వావలంబన, లింగ సమానత్వానికి ప్రతీకగా నిలిచినట్టు వారు పేర్కొన్నారు. బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హిరోషి యోషిజానే మాట్లాడుతూ 'సర్వింగ్ సొసైటీ విత్ సుపీరియర్ క్వాలిటీ' అనేది బ్రిడ్జ్‌స్టోన్ లక్ష్యమన్నారు.

అధిక ధరలను అదుపు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అధిక ధరలను ప్రభుత్వాలు అదుపు చేయాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ధరలు తగ్గిస్తామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు వ్యాపారస్తులకు లాభాలు చేకూర్చే విధంగా ప్రజల మీద భారాలు వేస్తున్నాయని మండిపడ్డారు. సిపిఎం 18వ వార్డు అంజయ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర ధరలను వ్యతిరేకించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బిజెపి ప్రభుత్వం దిగుమతి సుంకం 20 శాతం పెంచడం వల్ల వంట నూనె ధర లీటరుకు 40 రూపాయలు పెరిగిందన్నారు. బియ్యం కిలో 70 రూపాయలకు దాటిందని తెలిపారు.

నేడు లెనిన్ శత వర్ధంతి సభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : కమ్యూనిస్టు మేధావి లెనిన్ శత వర్ధంతి సభ ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని డాబాగార్డెన్స్‌లోగల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో లెనిన్ శత వర్ధంతి నిర్వహణ కమిటీ ఆధ్వర్యాన జరుగుతుంది. ఈ సభలో 'లెనిన్ విప్లవ జీవితం-సోషలిస్టు విప్లవం-నేటి సామ్రాజ్యవాదం' అన్న అంశంపై కీలకోపన్యాసం చేసేందుకు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (ఢిల్లీ) ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. అనంతరం 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి-లెనినిస్ట్ దృక్పథం-ప్రత్యామ్నాయ విధానాలు' అన్న అంశంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ప్రసంగించనున్నారు. లెనిన్ శతవర్ధంతి సభా కార్యక్రమం కొనసాగింపుగా మధ్యాహ్నం 'లెనినిజం-వర్తమానం- కర్తవ్యం' అన్న అంశంపై ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ ప్రసంగించనున్నారు.

ఒహెచ్‌సిని అప్‌గ్రేడ్ చేసిన హెచ్‌ఎస్‌ఎల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ తమ కాంట్రాక్ట్ కార్మికులతో సహా ఉద్యోగుల శ్రేయస్సు కోసం ఆక్యుపేషనల్ హెల్త్ సెంటర్ (ఒహెచ్‌సి)ని శనివారం అప్‌గ్రేడ్ చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. అత్యాధునిక వైద్య పరికరాలు, అధునాతన ఫర్నిచర్‌ను ఏర్పాటు చేసి అందరికీ ఇక్కడ మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఏర్పాట్లు చేసింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇండస్ హాస్పిటల్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.సుజాత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సంరక్షణ్ (హెచ్‌ఎస్‌ఎల్ లేడీస్ క్లబ్) అధ్యక్షురాలు వందనా ఖత్రి పాల్గొన్నారు.

ఆదివాసీలు ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి రంపచోడవరం : ఆదివాసీలంతా ఐక్యంగా ఉండాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు అన్నారు. మండలంలోని బోలగొండ గ్రామంలో సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.ప్రదీప్ దొర ఆధ్వర్యంలో ఆదివాసీ హక్కులపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం విద్య, వైద్యం, న్యాయం వంటి అన్ని రంగాలలో చాలా వెనకబడి ఉందన్నారు. ఇప్పుడున్న నాయకులు గాని, అధికారులు గాని ఆదివాసీలకు ఏవిధమైన న్యాయం చేయరని, న్యాయం జరిగే వరకు మనమే పోరాటం చేయాలని, అప్పుడే ఏజెన్సీ ప్రాంతం బాగుపడుతుందని చెప్పారు. అనంతరం సంఘం గ్రామకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చిలకల హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా విండేలా చిన్నారావు, కార్యదర్శిగా కడబాల శ్రీనుబాబు, సంయుక్త కార్యదర్శిగా విండేలా. వెంకటేశ్వర్లు, మరో 11 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు కురసం వరలక్ష్మి, డివిజన్ నాయకురాలు బోరగా ఎర్రమ్మ, గంగవరం మండల నాయకులు సుర్ల సత్యనారాయణ, అడ్డతీగల మండల నాయకులు ఫీర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ప్రాణాలకు భరోసా ఏదీ ?

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో మహిళల ప్రాణాలకు భరోసా లేకుండా పోయిందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. పుంగనూరులో గత ఆదివారం అదృశ్యమైన బాలిక అసిఫియా అంజుమ్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో శవమై తేలేదాకా పోలీసులు కనిపెట్టలేకపోయారని, ఫిర్యాదు అందినప్పుడే వారు సరైన రీతిలో స్పందించి ఉంటే ఈరోజు తల్లిదండ్రులకు కడుపుకోత ఉండేది కాదని అన్నారు. శనివారం ఉదయం సిరిపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రక్షణ కరువవుతుంటే హోం మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

8 నుంచి మలబార్ విన్యాసాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మారిటైమ్ మలబార్ 2024 సముద్ర విన్యాసాలకు విశాఖ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ క్రమంలో ఈ నెల 8 నుండి 18 వరకు మొదట హార్బర్ ఫేజ్, తర్వాత సి ఫేజ్‌లలో విన్యాసాలు జరుగుతాయి. ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా నావికా దళాలు పాల్గొంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ మలబార్ విన్యాసాలు హిందూ మహాసముద్రం, ఇండో - పసిఫిక్ ప్రాంతంలో పరస్పర సహకారాన్ని పెంపొందించడం కోసం 1992లో ప్రారంభమైనట్టు గుర్తుచేస్తున్నారు.

శారదా పీఠాధిపతికి కేటాయించిన భూమిని వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి గత ప్రభుత్వం కేటాయించిన భూమిని కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ విజ్ఞప్తి చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న భూమిని విశాఖలోని పాత్రికేయులకు కేటాయించాలని కోరారు. ఈ విషయమై శనివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆయన నివాసంలో రామ్ వినతిపత్రం అందజేశారు.

విశాఖ ఆర్‌డిఒగా శ్రీలేఖ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ఆర్‌డిఒగా పి.శ్రీలేఖ శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

న్యూ టిన్సుకియా - ఎస్‌ఎంవిటి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పండగ సీజన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం న్యూ టిన్సుకియా - ఎస్ఎంవిటి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 05952 న్యూ టిన్సుకియా - ఎస్ఎంవిటి బెంగళూరు ప్రత్యేక రైలు నవంబర్ 7 నుంచి డిసెంబర్ 26 వరకు ప్రతి గురువారం సాయంత్రం 18.45 గంటలకు న్యూ టిన్సుకియా నుంచి బయలుదేరి మూడో రోజు (శనివారం) 15:20 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 15:25 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 9:00 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది. 05951 ఎస్ఎంవిటి బెంగళూరు -న్యూ టిన్సుకియా ప్రత్యేక రైలు నవంబర్ 11 నుంచి డిసెంబర్ 30 వరకు ప్రతి సోమవారం 00.30 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు నుండి బయలుదేరి అదేరోజు రాత్రి 21:15 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 21:20 గంటలకు బయలుదేరి బుధవారం 13:15 గంటలకు న్యూ టిన్సుకియా చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్ మీదుగా ప్రయాణిస్తాయి.